# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



# భూములన్నీ మళ్లీ బీళ్లు

## రైతులకు నిత్యం కన్నీళ్లు

- రైతుల బతుకులను ఆగం చేసేలా కాంగ్రెసోళ్ల మాటలు
- పాత రోజులను తలచుకుంటూ దిగులుపడుతున్న కర్షకులు
- కరెంటు లేక.. మడులకు నీరు పారక అర్ధరాత్రులు అవస్థలు
- ధరణిని తీసివేస్తే దగాకోర్ల రాజ్యమేనంటున్న రైతులు
- సీఎం కేసీఆర్ పాలనలో 24 గంటల విద్యుత్‌తో పుష్కలంగా పంటలు

ఖమ్మం, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కాంగ్రెసోళ్ల మాటలు వింటున్న రైతులు భయభ్రాంతులకు గురవుతున్నారు. 2014కు ముందున్న పరిస్థితులను గుర్తు చేసుకుంటూ దిగులు చెందుతున్నారు. కాంగ్రెస్ హయాంలో ఒక వైపు సక్రమంగా సాగునీరు లేక, కరెంటు సరిగ్గా రాక.. తెల్లవారుజామున వచ్చే త్రీఫేజ్ కరెంటు కోసం పడిగాపులు కాస్తూ తడిపెట్టిన పంట పొలాల పరిస్థితిని వారు ఇంకా మర్చిపోలేదు. మరోవైపు ఎరువుల కొరత ఎక్కువగా ఉండడంతో షాపుల వద్ద బారులు తీరిన సందర్భాలు కోకొల్లలు. రైతులు సమావేశాలు పెట్టుకోవాలంటే చెట్ల కిందనే మీటింగ్‌లు పెట్టుకునే పరిస్థితి ఉండేది. ఇవన్నీ ఎలా మర్చిపోతామని పలువురు రైతులు గుర్తు చేసుకుంటున్నారు.

### ధరణి తీసేస్తే ఆగమే..

గతంలో పాస్ పుస్తకాల కాలం. దీంతో ఎవరి భూమి ఎక్కడుందో తెలియని పరిస్థితి. పాస్ పుస్తకాల్లో కేవలం నెంబర్లు మాత్రమే ఉండేవి. కానీ.. రైతులు మాత్రం మా పొలం మా దగ్గరే ఉందనే నమ్మకంతో సాగు చేసుకుంటున్న పరిస్థితి. అయితే పాస్ పుస్తకాల్లో సర్వే నెంబర్లు మార్పు చేసిన వీఆర్వోలు రైతుల మధ్య పెద్ద పెద్ద గొడవలే సృష్టించారు. ఆమ్యామ్యాలకు అలవాటుపడి ఒకరి పొలం సర్వే నెంబర్లు ఇంకొకరికి పాస్ పుస్తకాల్లో ఎక్కించి రైతుల కుటుంబాలను ఇబ్బందులపాలు చేశారు. ఇవన్నీ పాత రోజులు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత వ్యవసాయ రంగంలో నూతన మార్పులు తీసుకురావడంతోపాటు రైతులకు 24 గంటలు కరెంటు రావడంతో రైతులు రెండు పంటలు పండించుకునే అవకాశం కలిగింది. దీంతో ధరణిని అందుబాటులోకి తేవడంతో రైతుల పొలాల సర్వే నెంబర్లు ఆన్‌లైన్ చేశారు. ఎప్పటి నుంచో ఉన్న సర్వే నెంబర్ల సమస్య ఒక కొలిక్కి వచ్చింది. మళ్లీ కాంగ్రెస్ వస్తే పటేల్, పట్వారీ, వ్యవస్థ వల్ల దోపిడీదారుల వ్యవస్థ వస్తుందేమోనని రైతులు భయపడుతున్నారు. దీనిని చాలా మంది మేధావులు, రైతులు, ప్రజలు తిరస్కరిస్తున్నారు.

### చివరికి వ్యవసాయం ఆగమే అంటున్న రైతన్నలు

సక్కపడ్డ వ్యవసాయ రంగంలో మళ్లీ పాత పద్ధతులు వచ్చే అవకాశాలు లేకపోలేదు. పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసే పరిస్థితి ఉండదు. పాత పద్ధతిలో సొసైటీల ద్వారా ఎరువులు ఇవ్వడం వల్ల పెద్ద రైతులకు మాత్రమే ఎరువులు లభించే పరిస్థితి ఉంటుంది. దీంతో చిన్న రైతులు వ్యవసాయానికి దూరమయ్యే ప్రమాదం ఉంది. చిన్న కమతాలలో వ్యవసాయం చేయలేక మళ్లీ కూలీలుగా మారే పరిస్థితి ఉండబోతుంది. ధరణిని తీసేస్తే కౌలు రైతులకు రైతుబంధు ఇచ్చే ప్రతిపాదనను కాంగ్రెస్ తీసుకొస్తామంటున్న తరుణంలో రైతులు పొలాలను కౌలుకు ఇచ్చే పరిస్థితి ఉండదు. దీంతో సక్కబడ్డ సాగు భూములన్నీ మళ్లీ బీళ్లుగా మారబోతాయని రైతులు చర్చించుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల మాటల పట్ల ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతులు, రైతు కూలీలు, చిరు వ్యాపారులు, గృహిణులు మండిపడుతున్నారు. ఒకవైపు ధరణి తీసివేయడంతోపాటు మరోవైపు మూడు గంటల కరెంట్‌పై పదే పదే మాట్లాడుతుండడంతో ఆ పార్టీ నాయకులకు ఎన్నికల్లో తగిన రీతిలో సమాధానం చెబుతామని పేర్కొంటున్నారు.



### సీఎం సార్ సల్లని చూపుతో వ్యవసాయం చేసుకుంటున్నాం..

సీఎం కేసీఆర్ రైతుల పట్ల చూపిస్తున్న సల్లని సూపుతో వ్యవసాయాన్ని సంతోషంగా చేసుకుంటున్నాం.. నాచిన్నతనంలో మా తల్లిదండ్రులు పంట సాగు చేయటానికి అరిగోసం పడేది. విత్తనాలు, ఎరువులు సరిగ్గా ఉండకపోయేది. తోటకు నీళ్లు కట్టడానికి కరెంట్ లేకపోయేది. భూములకు భద్రత ఉండేది కాదు. కేసీఆర్ సార్ ధరణీని అందుబాటులోకి తీసుకువచ్చి పట్టాభూములుగా మార్చిండు. పెట్టుబడులకు రైతుబంధు సాయం అందుతుంది. ఉచిత కరెంట్ ఇస్తుండు. పండించిన పంటకు ఊర్లల్లోనే కొనగోలు కేంద్రాలు పెట్టి గిట్టుబాటు ధర కల్పిస్తుండు... ఇవన్ని అప్పట్లో లేక మా కుటుంబం అప్పుల పాలై పండించిన పంటంతా సావుకార్లకే పోయేది. రైతుబంధువైన కేసీఆర్ సార్ మూడోసారి ముఖ్యమంత్రి కావాలి... రైతులకు మరింత మేలు జరగాలి.

**–కేలోత్ అనిత, యువ మహిళారైతు, బొక్కలతండా, కారేపల్లి మండలం**

### కాంగ్రెసోళ్లవన్నీ బూటకపు హామీలు

కాంగ్రెస్ పార్టీ అధికార దాహంతో రైతులను మభ్యపెట్టాలని ప్రయత్నాలు చేస్తుంది. ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్న రైతుబంధు పథకాన్ని కాపీ కొట్టి రైతుభరోసా అనే పథకం అమలు చేస్తామంటున్నారు. ఏటా ఎకరాకు రైతుకు రూ.15 వేలు, కౌలురైతుకు రూ.15 ఇస్తామని అంటున్నారు. ఇప్పుడు అసలైన రైతులకు డబ్బులు ఇస్తే కౌలురైతులకు ఇవ్వం. కౌలురైతులకు ఇస్తే అసలైన రైతులకు ఇవ్వమని రేవంత్‌రెడ్డి అంటున్నారు. రేవంత్‌రెడ్డికి వ్యవసాయం గురించి ఏ మాతం అవగాహన లేదు. రైతులకు ఎలాంటి పథకాలు అమలు చేస్తారనే విషయంలో స్పష్టత లేదు. ఆచరణలో సాధ్యం కానీ హామీలతో కాంగ్రెస్ పార్టీ రైతులను మోసం చేయాలని చూస్తుంది.

**– వెలివెల కృష్ణయ్య, రైతు, పెనుబల్లి**





### కరెంట్ వేస్తానికి పోయి కాలుజారి పడ్డా


కాంగ్రెస్ పాలనలో వ్యవసాయానికి పగలు కరెంట్ ఉండేది కాదు. రాత్రి పూట కరెంట్ మోటర్ స్విచ్ వేయడానికి పోయి పొలంలో కాలు కింద పడి కొన్ని రోజులు మంచం మీద నమిశా. ఇచ్చిన కొద్ది సేపు కరెంట్‌కు మడులు తడిసేది కాదు. పంట వేసిన కాడి నుండి రాత్రంతా నీళ్లు కట్టడానికే సరిపోయేది. అయినా పంట మొత్తం తడిసేది కాదు. కరెంట్ మోటర్లు కాలిపోయేవి. సీఎం కేసీఆర్ ఇస్తున్న 24గంటల కరెంట్‌తో మా కష్టాలన్నీ తొలగిపోయాయి. పంట పొలం, మిరపతోట మొత్తాన్ని తడిపేందుకు పొద్దంతా కరెంట్ ఉంటుంది. ఇప్పుడేమో కాంగ్రెసోల్లు మళ్లీ మూడు గంటల కరెంట్‌ను తీసుకువస్తామని రైతులను భయ భ్రాంతులకు గురిచేస్తున్నారు. ఈసారి కూడా కేసీఆర్ సార్‌నే సీఎంగా గెలిపించుకుంటాం...ఎవరి మాటలు విని మోసపోయేది లేదు.

**ఇమ్మడి అంజయ్య,రైతు, లింగంబంజర, కారేపల్లి మండలం**

### నాటి కష్టాలు ఎన్నో పోయాయి..

తెలంగాణ వచ్చిన తర్వాత ఈ పదేళ్లలో కరెంట్ కోసం ధర్నాలు చేసిన రోజులే లేవు. 24 గంటలు కరెంట్ ఉంటుంది. అప్పట్లో మా రైతుల బతుకులు రోడ్ల మీద, మోటర్లు రిపేర్లు చేసే దుకాణాల వద్దే ఉండేవి. కరెంట్ కోసం ఎన్నో బాధలు పడ్డాం. ఆందోళనలు చేశాం. కేసీఆర్ పాలనలో నాటి ఇబ్బందులు తప్పాయి. ఇప్పుడు కాంగ్రెస్ నాయకులు మూడు గంటలు విద్యుత్ చాలు, ఇంకా 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలంటున్నారు. ఇప్పటి వరకు 10 హెచ్‌పీ మోటర్లు వాడినోళ్లు చూడలేదు. కాంగ్రెసోళ్లు ఎందుకు మాట్లాడుతున్నారో వారికే తెలవాలి. వాళ్లు వస్తే వ్యవసాయం కచ్చితంగా ఆగమవుతుంది. రైతు బతుకు మళ్లీ రోడ్డుపై పడుతుంది. కేసీఆరే రావాలి, ఆయనే సీఎం కావాలి.

**–రేగళ్ల చెన్నకేశవరెడ్డి, ఎర్రగుంటపాడు, వేంసూరు మండలం**





### పట్టాలు చేయించుకునేందుకు కాళ్ల చెప్పులరిగేలా తిరిగా



నా భూమికి పట్టాదారు పాసు పుస్తకం చేయించుకునేందుకు ఏళ్ల తరబడి ఆఫీసులు, అధికారుల చుట్టూ కాళ్ల చెప్పులు అరిగేలా తిరిగాను. జేబులో డబ్బులన్నీ ఖాళీ అయ్యాయి కానీ పని మాత్రం కాలేదు. సీఎం కేసీఆర్ సార్ తీసుకవచ్చిన ధరణీ వల్ల పట్టాలయ్యాయి. పెట్టుబడి సాయంగా రైతుబంధు వస్తుంది. పత్తిచేను, మిరప తోటలకు నీళ్లు కట్టేందుకు ఉచిత కరెంట్ వస్తుంది. అప్పుడు పండిన పంటంతా పెట్టుబడులు, అప్పులు కట్టేందుకు సరిపోయేది. ఇప్పుడా వసరం లేకుండా పోయింది. ప్రభుత్వమే పెట్టుబడికి సాయం అందిస్తున్నది. సాగుకు కరెంట్ ఇస్తున్నది. ఇంత కంటే ఏం కావాలి రైతులకు .. మళ్లీ సీఎంగా కేసీఆర్ సారే రావాలి.

**–గుగులోత్ లచ్చా, రైతు, పింజరమడుగు, కామేపల్లి మండలం**

### కారు గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్‌కు బుద్ధి చెపుతాం

రైతు కుటుంబాలను బాధపెట్టే మాటలు మాట్లాడే కాంగ్రెస్ పార్టీకి ఈ నెల 30వ తేదీన జరగనున్న ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి తగిన బుద్ధి చెపుతాం.. నాచిన్న తనం నుంచి చూస్తున్న రైతులకు ఇంత మంచి జరుగుతుందని కలలో కూడా ఊహించలేదు. కేసీఆర్ సార్ పాలనలోనే రైతులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వ్యవసాయం చేస్తుండ్రు. అట్లాంటి సార్ ఉంటేనే మాలాంటి లక్షలాది కుటుంబాలు సంతోషంగా సాగు చేస్తాం.ఎన్నో సార్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పాలనను చూశా కబుర్లు చెప్పుడు తప్ప చేతలు ఉండవు. రైతు కష్టాలు గుర్తించిన కేసీఆర్ సార్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలి. ఎవరెన్ని చెప్పినా నా కుటుంబం అంతా కారు గుర్తుకే ఓటు వేస్తుంది.



**–మొగిలిచర్ల నాగేశ్వరరావు, రైతు, విశ్వనాథపల్లి పంచాయతీ, కారేపల్లి మండలం**

### కాంగ్రెస్‌ను నమ్మితే మొదటికే మోసం

కాంగ్రెస్ పార్టీని నమ్మితే రైతులకు మొదటికే మోసం వస్తుంది. ఉమ్మడి రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ రైతుల గురించి పట్టించుకోలేదు. రైతుల వ్యవసాయం చేయాలంటే భయపడేవారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్న పథకాల ఫలితంగా వ్యవసాయ రంగం పండుగలా మారింది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ మరోసారి రైతులను మోసం చేయడానికి ప్రయత్నిస్తుంది. రైతులు కాంగ్రెస్ నాయకుల మాటలను నమ్మడం లేదు. ఎన్నికల ఓట్ల కోసం వారు హామీలు ఇస్తున్నారే తప్ప రైతుల మేలు చేయాలని ఉద్దేశ్యంతో కాదని అర్థమవుతుంది. రైతులకు మేలు చేస్తున్న బీఆర్ఎస్‌ను గెలిపించుకుందాం.



**– సోడా రాంబాబు, భవన్నపాలెం, పెనుబల్లి మండలం**